# ఉపాధి 'గాయం'

వి. ఉదయలక్ష్మి

**'ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న సందర్భంలో ప్రమాద కారణంగా గాయమైతే ఉచిత వైద్య సదుపాయం అందించాలి.'**

**'గాయపడిన వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించాల్సి వస్తే ఆసుపత్రి ఖర్చు - వైద్యం - మందుల ఖర్చుతో పాటు కూలీ రేటులో 50 శాతం తగ్గకుండా చెల్లించాలి'**

... ఇవి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలోని 24, 25 నిబంధనలు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలో గాయపడిన శ్రామికులెవరికీ ఈ సదుపాయాలు దక్కలేదు. ఈ కారణంగా గాయపడిన వారి కుటుంబాలు వందలాది పనిదినాలను కోల్పోయాయి. అధిక వడ్డీలపై అప్పులు చేశాయి.

"మొదటి రోజు ఓ గుంత తీసిన.. రెండో గుంత తీయబోతున్న.. గడ్డపార దిగింది. డాక్టరు ఇంటికొచ్చాడు. సూదిచ్చి మందులు రాశాడు. వారం రోజులు పని చేయలేక పోయిన. పదిహేనేలు అప్పు చేసిన. వడ్డీ కట్టుడే సరిపోతంది. అసలు పైసా తీర్లేదు. మా ఆయన ఆరోగ్యం బాగుండదు. పార బట్టి పన్జేయలేక పండ్లమ్ముతున్నడు గాని గిరాకీ లేదు. ఏం చేయమంటరు" అని ప్రశ్నిస్తోంది కందుకూరి ఆండాలు. ఈమె ఆగపల్లి పంచాయతీ పరిధిలోని కాగజ్‌ఘట్ వాస్తవ్యురాలు. ఆగపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య ఈమెకు వైద్య ఖర్చులిప్పించేందుకు ప్రయత్నించారు. గ్రామ కార్యదర్శితో సంతకం చేయించిన దరఖాస్తును ప్రోగ్రామ్ ఆఫీసరు (పిఓ)కి అందచేశారు. పిఓ "సహాయం అందచేస్తామన్నారు. డాక్టర్ రాసిన మందుల చీటీలు తెమ్మన్నారు." ఈ నేపథ్యంలో ఆండాలు ఇచ్చిన మందుల చీటీలు తీసుకుని పిఓని కలిశారు యాదయ్య. ఈసారి ఆయన మరోవిధంగా చెప్పారు. ప్రభుత్వాసుపత్రిలో మెడికల్ సర్టిఫికెట్లు తెమ్మన్నారు. ఆండాలు ప్రభుత్వాసుపత్రిలో చేరలేదు కాబట్టి అక్కడ సర్టిఫికెట్ ఇచ్చేందుకు తిరస్కరించారు. అంచేత పిఓ "సాయం ఇవ్వలేం" అన్నారు.

ఆండాలు గాయం తాలూకూ బాధ ఆమెకే పరిమితం కాలేదు. భార్యను ఆసుపత్రుల చుట్టూ తిప్పుడూ వారం రోజులు పండ్ల బండి పక్కన బెట్టాడు ఆమె భర్త విష్ణు. వాళ్ల కూతురు వారం రోజులు పని మానేసింది. 500 రూపాయల కూలి డబ్బు కోల్పోయింది. నొప్పి కారణంగా ఆండాలు పాతిక రోజులు పనికి దూరమైంది. అంటే ఆండాలుకు తగిలిన ఒక్క దెబ్బ కారణంగా ఆమె కుటుంబం 396 పనిదినాలను కోల్పోయిందన్నమాట! మంచాల మండలంలో 'ఉపాధి హామీ' పనులకెళ్లిన పలువురు శ్రామిక మహిళలకు ఇదే తరహా చేదు అనుభవాలు ఎదురైనాయి. ఈ మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో 14 పంచాయతీలపై పరిశీలన జరపగా 12 పంచాయతీల్లో 20 మంది గాయపడినట్టు తేలింది. వారిలో 14 మంది మహిళలు.

లోయపల్లి గ్రామానికి చెందిన లచ్చిమి మెడికల్ రిపోర్టులు ఉన్నప్పటికీ అధికారులకు విషయం తెలియ జేయలేదు. "పని చేసిన రోజులకే పైసలొస్తలేవు. ఆరునెల్లు గడిసినా కూలి రాలేదు. ఇంక ఈ దెబ్బకి డబ్బు లేమిస్తరని ఎవరికీ చెప్పలేదు" అని తెలిపింది. మట్టికట్టలు నిర్మించే సందర్భంలో గడ్డపార తగలడం వల్ల ఈమె పాదానికి బలమైన గాయమైంది. 'రెండు వేలు కాలికి పెట్టిన. రెండు మూడేలు కడుపుకి తిన్న' అంటున్న లచ్చిమి గాయపడిన ఏడు నెలల తర్వాత కూడా పనికి వెళ్లలేకపోతోంది. హైదరాబాదులోని సంతోష్‌నగర్‌లో తీయించుకున్న ఎక్స్‌రే ముందుబెట్టి లచ్చిమి గాయపడిందనడానికి ఇంతకంటే ఆధారం ఏమి కావాలన్నట్టు చూశాడు ఆమె భర్త.



'నా పాదంలో గడ్డపార దిగిందండీ.. ఈ 'ఎక్స్‌రే' ఆధారం చూడండి'...లచ్చిమి

దాద్‌పల్లికి చెందిన మందుల యశోధ కూడా ఇదే తరహాలో తీవ్రంగా గాయపడింది. గడ్డ పార దిగబడి పాదం వాచిపోవడంతో మూడు రోజులు ఆసుపత్రిలో చికిత్స పొందింది. కోలుకోవడానికి మూడు నెలలు పట్టడం వల్ల అన్ని రోజులూ పని కోల్పోయింది. ఆసుపత్రిలో ఉన్న ఈ యశోధ సైతం అరజీతం కానీ, వైద్యఖర్చులు గానీ పొందలేకపోయింది. ఈమె స్వయంగా 'ఎండిఓ మేడమ్'ని కలిసింది. కానీ మందుల ఖర్చుల చీటీ లేనిదే సాయం ఇవ్వలేమన్నారట పిఓ! "గడ్డపార రాయికి తగిలి బెసికింది. యశోధ పాదంలో దిగబడింది. ఇందులో ఆమె తప్పేమీ లేదు. కానీ మెడికల్ బిల్లు రాకపోవడమే కాదు. భర్త తిట్లూ ఆమెకు తప్పలేదు' అంటారు దాద్‌పల్లి ఫీల్డ్ అసిస్టెంట్ మాదయ్య.

"ఈడ నీళ్లుండవు. వర్షమొస్తేనే పనులుంటయి. ఈ పనులు బాగుండయి. గతేడు ఇంత పని లేదు. పని దొరికినా పాతికా ముప్పయికి మించి కూలి రాదు" అంటున్న హంసమ్మ దెబ్బ తగలకపోతే 75 రోజులూ పనిచేయాలనుకుంది కానీ దెబ్బ వలన తన పనిదినాలను వినియోగించుకోలేకపోయింది.

గాయపడిన వారిలో చాలామంది వైద్యం కోసం నాలుగు రూపాయల వడ్డీపై అప్పులు చేశారు. ఇంతకంటే తక్కువ వడ్డీతో తమకు అప్పు పుట్టబోదని చెబుతున్నారు. పిఓ చుట్టూ 'తిరగాలంటే అదనంగా ఖర్చు పెట్టాల్సిందే. మళ్లీ అప్పు చేసి తీరాల్సిందే' అంటున్నారు. ఓ వక్క రోజువారి జీవితావసరాలు.. మరోవైపు అప్పులు ఈ శ్రామికుల్ని విశ్రాంతికి దూరం చేస్తున్నాయి. కాలు వాస్తున్నా సరే ఉలవచేను కోయడానికి పోతోంది జాపాలకు చెందిన రాములమ్మ.

ఈ పరిస్థితి ఒక్క మంచాల మండలానికే పరిమితం కాదని, రంగారెడ్డి జిల్లాలో ఎక్కడా గాయపడిన వాళ్లకి ఉచిత వైద్యభాగ్యం దక్కలేదని వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జగన్ తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితీ ఇందుకు భిన్నంగా లేదంటున్నారు ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంజీవ. ఈ సందర్భంగా తాను నివసించే ప్రాంతమైన నిజామాబాద్ జిల్లా నవీపేట మండల స్థితిని ఆయన ఉదహరించారు. "ఈ మండలంలో సుమారు నలభై మంది గాయపడ్డారు. స్త్రీలే ఎక్కువ ప్రమాదాల పాలయ్యారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చూపించుకుంటేనే మెడికల్ బిల్లు ఇస్తామని చెబుతున్నారు. ఆరోగ్యకేంద్రాల్లో వైద్యుల్లేరు. చివరికి ఫస్ట్ ఎయిడ్ బాక్సులు కూడా పని ప్రదేశాల్లో అంతగా ఏర్పాటు కాలేదు" అని వివరించారు. ఈయన తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా బిక్కనూరు మండలం రాజంపేట గ్రామంలో గుంతలు తవ్వుతూ ఓ కూలీ చనిపోయాడు. ఇంత వరకు అతని కుటుంబానికి ఎలాంటి ఎక్స్‌గ్రేషియా దక్కలేదు. దేశంలో ఉపాధి హామీ పథకం బాగా అమలవుతున్న నాలుగు జిల్లాల్లో ఒకటిగా ఎంపికైన ఆదిలాబాద్ జిల్లాలోనూ పరిస్థితి మెరుగ్గా లేదంటారు స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింగ్. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాదు పశ్చిమ ప్రాంతా మండలాల్లో గాయపడిన వారికి ఉచిత వైద్యసాయం దక్కలేదు.

మంచాల మండలంలో ఇప్పటివరకు పనిచేసిన శ్రామికుల్లో అత్యధికులు మహిళలే. గాయపడిందీ అత్యధికంగా వాళ్లే. వీరికి "గవర్నమెంట్ ఆసుపత్రిలో చికిత్స పొందితేనే బిల్లు చెల్లిస్తామనలేదు. బాధితుల్ని మెడికల్ బిల్లులు తెమ్మనగానే మరి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో వీరిలో ఎవ్వరికీ వైద్య చికిత్స తాలూకూ బిల్లు చెల్లించలేదు. అర జీతమూ ఇవ్వలేదు" అంటున్నారు పిఓ సూరిబాబు. కానీ బాధితుల్లో కొందరి మెడికల్ బిల్లులూ, గ్రామ కార్యదర్శుల లేఖలూ పిఓకి అందచేసినట్టు ఫీల్డ్ అసిస్టెంట్లు యాదయ్య (ఆగపల్లి) శ్రీకాంత్ (ఆరుట్ల) చెప్పారు.

ఉపాధి హామీ పథకం ద్వారా లాభం

పొందేవారిలో మూడవ వంతు స్త్రీలు ఉండాలని చట్టం చెబుతోంది. వాస్తవానికి ఈ సంఖ్య మంచాల మండలంలో చాలా ఎక్కువగా ఉంది. గ్రామీణ మహిళా కూలీలకు ఇదో వరంగా ఉంది. "నేనూ నా కొడుకు కృష్ణా పన్నెండు రోజులు పనిచేశాం. 1700 రూపాయలు సంపాదించాం. కూలికిపోతే ముప్పయికి మించి దొరకవు" అంటుంది జాపాల గ్రామ పంచాయతీ సభ్యురాలు కొప్పు బాలమ్మ.

"ఇంతకు ముందు రైతుల కాడ అప్పు చేసేదాన్ని. అప్పు తీర్చడం కోసం వారి పొలాల్లోనే పని చేసేదాన్ని. పొద్దున పది నుండి సాయంకాలం ఆరు దాకా చేస్తే ఇరవై రూపాయల కూలి వచ్చేది. ఇప్పుడు రోజుకు ఎనభై వస్తంది" అంటూ ఉపాధి హామీ పథకం ద్వారా లభించిన కనీస వేతనంతో మెరుగైన తన జీవన స్థితిని వివరిస్తుంది పరిగి మండలం రంగాపూర్‌కు చెందిన ఒంటరి మహిళ యాదమ్మ. నిజమే.. ఉపాధి హామీ పథకం వల్ల బాలమ్మ – యాదమ్మ వంటి లక్షలాది స్త్రీలు పనిని ఓ హక్కుగా పొందగలుగుతారు. కడుపుకింత తినగలుగుతారు. అదే సమయంలో సామాజిక ఉత్పత్తికి దోహదపడతారు.

గ్రామాల్లో విస్తారమైన బంజరు భూములున్నాయి. ముళ్లపొదల్ని తొలగింప చేయడం.. భూమిని చదును చేయడం, సాగుకు యోగ్యంగా మలచడం.. నీటి వనరుల్లో పూడిక తీయడం.. భూమి అభివృద్ధికి వలసిన రకరకాల పనులు చేపట్టడం.. ఇవన్నీ అవశ్యకాలే. ఉత్పత్తికి దోహదపడే పనులే. మన దేశంలో కోట్లాదిగా ఉన్న శ్రామికుల రెక్కల కష్టం తోడైతే, ఈ ప్రకృతి వనరుల్లోంచి సంపద జాలువారుతుంది. అసలు ఉపాధి హామీ పథకం ముఖ్యోద్దేశమే గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించడం.. తద్వారా సామాజిక ఉత్పత్తిని పెంపొందింపచేయడం. ఆ ఉద్దేశం నెరవేరాలంటే ఉపాధి హామీ చట్టాన్ని అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో అమలు చేయాలి. పథకానికి జీవనాడిగా వున్న శ్రమజీవులకు న్యాయబద్ధంగా దక్కాల్సినవి దక్కాలి. సాంకేతికపరమైన సాకులు చూపుతూ వైద్యసాయాన్ని నిరాకరించే బదులు విచారణ ద్వారా వాస్తవాలను గమనించవచ్చు. ఇందుకు సంబంధించిన అవగాహనా కల్పించవచ్చు. గ్రామీణ పేదలకు పని భద్రత కల్పించబోయి, వారిని ఆర్థికంగా అభద్రత పాల్జేయడం ఏ విధంగానూ క్షంతవ్యం కాదు.

– (రచయిత సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఇన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) ఫెలోషిప్ గ్రహీత. 'ఎన్ఆర్ఇజిఏ అమలులో పంచాయతీల పాత్ర'పై పరిశోధన చేస్తున్నారు.)

## గొలుసు కుదవబెట్టిన..



రాములమ్మ

స్త్రీలే కుటుంబ పోషకులైన చోట పరిస్థితి మరింత బాధాకరంగా ఉంది. జాపాలకు చెందిన రాములమ్మ తన కుటుంబానికి ఏకైక ఆధారం. గుంటలో పడి ఆమె కాలు బాగా వాచిపోయింది. రెండు మూడు నెలలు లేవలేకపోయింది. "బంగారం గొలుసు కుదవబెట్టి రెండువేలు తెచ్చుకున్న. మందులు, టానిక్కులు మూడు వేలయినయి. ఇంకా నొప్పి తగ్గలేదు. నిద్ర పోనిస్తలేదు. పనిచేస్తే మల్లీ వాస్తంది" అంటున్న రాములమ్మ దెబ్బ తగలగానే గ్రామ కార్యదర్శికి విషయం తెలిపింది. ఈమె అందించిన డాక్టరు సర్టిఫికెట్‌నూ గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఉత్తరాన్నీ పిఓకి అందించారు ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్. ఫలితం దక్కలేదు. ఆరుట్ల గ్రామానికి చెందిన అరవై ఏళ్ల అల్వాల యాదమ్మ పరిస్థితీ ఇందుకు భిన్నంగా లేదు. ఈమె తన కుటుంబంలో ఏకైక పోషకురాలు. పనికెళ్లిన రోజే ఈమె కాల్లో గడ్డపార దిగబడింది. ఆసుపత్రిలో 600 రూపాయల బిల్లయింది. 'రొట్టెకోసం – మందులకోసం' 800 అప్పు చేసింది. ఈ గ్రామానికి చెందిన అలువాలు హంసమ్మ, ఏర్పుల యాదమ్మ, అనిత కూడా గడ్డపారలు దిగి గాయపడిన వాళ్లే. "కాలు దొడ్డ వాసింది. నెల రోజులు లేవలేదు బిడ్డ. మందుల కర్చులూ తిండి కర్చులూ కలిపి వెయ్యి రూపాయలయింది" అని తెలిపింది అనిత తల్లి పొట్ల మల్లమ్మ. గతంలో ట్రాక్టరు మీద నుండి పడిపోవడం చేత మల్లమ్మ చెయ్యి విరిగింది. అందుచేత ఎడమ చేత్తోనే కానుగ మొక్కల కోసం గుంతలు తవ్వింది. బిఎస్సీ రెండవ సంవత్సరం చదువుతున్న ఆమె కూతురు అనిత తన తల్లికి సాయపడదామనుకుంది. కనీసం కాలేజీ ఖర్చులయినా వస్తాయనుకుని పనికిపోయి గాయాల పాలయింది.

గాయపడిన పలువురి మహిళలకు సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్లు, గ్రామ కార్యదర్శుల లేఖలు పిఓ దగ్గరకు వెళ్లినాయి. ఎవ్వరికీ ఇంతవరకూ వైద్య ఖర్చులు దక్కలేదు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందితేనే మెడికల్ బిల్లు ఇస్తామని పిఓ చెప్పినట్టు యాదయ్య మరికొందరు తెలుపుతున్నారు. అసలు తమ ఊరి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరునెలలుగా డాక్టర్లే లేరని చెబుతున్నారు ఆరుట్ల గ్రామస్తులు. (మండలంలోనే అతి పెద్ద గ్రామంగా ఉన్న ఆరుట్ల జనాభా దాదాపు 13000). "మాకయితే గవర్నమెంటు దవాఖాన లేదు. 30 కిలోమీటర్ల దూరం పోయి ఇబ్రహీంపట్నంలో చూయించుకోవాలి. బస్సులు సరిగ్గా ఉండవు. పుసుక్కున చచ్చినా గతి లేదు. జీపు కట్టుకుపోతే వందలవుతాయి" అంటూ ప్రభుత్వాసుపత్రి మెట్లు ఎక్కాలంటే ఎంత కష్టపడవలసి ఉంటుందో వివరించింది లోయపల్లికి చెందిన లక్ష్మి. కాలేజీలో చదువుకుంటున్న ఈమె కొడుకు శ్రీకాంత్ పాదంలో గడ్డపార దిగడంతో 5000 రూపాయల అప్పయింది. ఈ యువకుడు నాలుగు నెలలు పని కోల్పోయాడు. చదువుకీ దూరమయ్యాడు. "బిల్లులు కావాలని ఎవ్వరూ చెప్పలేదు. వాటిని దాచుకోవాలనీ తెలీదు. గుడిసెలో అవి ఏడనో పడినాయి" అంటుంది లక్ష్మి.